
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం, 19, జూలై, 2025



సోమశిలలో 27.800 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 27.800 టీఎంసీలు ఉన్నాయి. 2,603 క్యూసెక్కుల వస్తోంది. పెన్నార్ డెల్టాకు 4,250, ఉత్తర, దక్షిణ కాలువలకు 775 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,01,200
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,149
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,423
నవర (8 గ్రాములు)	రూ.75,384

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.6 /26.2

జిల్లాలో శనివారం వాతావరణం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం గాలిలో తేమ 62 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రవాణా అధికారుల విస్తృత తనిఖీలు

- రూ.2 లక్షల జరిమానాల వసూలు



తనిఖీలు నిర్వహిస్తున్న రవాణా అధికారులు

నెల్లూరు (టౌన్): ఎలాంటి పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనాలను జిల్లా రవాణా అధికారులు తనిఖీ చేపట్టారు. శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో విస్తృత తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్స్, ట్రిపుల్ రైడ్, నిబంధనలకు విరుద్ధంగా నంబరు ప్లేట్లు, వాహన పత్రాలు లేని 40 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.2.05 లక్షల అపరాధ రుసుం వసూళ్లు చేశారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు బాబు, రాంబాబు, కార్తీక్, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, లాల్, స్వప్నిల్‌రెడ్డి, సంధ్య, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నేడు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం అండర్–11, 13, 15, 17, 19 సింగిల్స్, డబుల్స్, మెన్, ఉమెన్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక కావడం జరుగుతుందన్నారు.

రౌడీషీటర్‌పై పీడీయాక్ట్ నమోదు

నెల్లూరు (క్రైమ్): హత్యాయత్నం కేసులో జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న ఓ రౌడీషీటర్‌పై వేదాయపాళెం పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంగళరావునగర్‌కు చెందిన షేక్ యాసీర్ హత్యాయత్నం, కొట్లాట, వ్యక్తులను బెదిరించి నగదు దోచుకోవడం, మారణాయుధాలతో ఇతరులపై దౌర్జన్యం చేయడం వంటి ఘటనలకు సంబంధించి వేదాయపాళెం పోలీసుస్టేషన్‌లో ఆరు కేసులున్నాయి. పలుమార్లు తీరుమార్చుకోమని పోలీసులు తమదైన శైలిలో కౌన్సిలింగ్ చేసినా అతనిలో మార్పు రాకపోగా యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు. కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశాలతో యాసీర్‌పై వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు పీడీయాక్ట్ నమోదు చేశారు. శుక్రవారం అతన్ని జిల్లా కేంద్ర కారాగారం నుంచి కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

సంగంలో ఐటీఐ కళాశాలను ప్రారంభిస్తాం

సంగం: సంగంలో ఐటీఐ కళాశాలను త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని, భవనాలను పూర్తి చేసి రెండు నెలల్లో తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సంగం మండలం తరుణవాయిలో ల్యాంకో ఫౌండేషన్‌కు చెందిన భవనాలను శుక్రవారం మంత్రి ఆనం పరిశీలించారు. ఆయన వెంట ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, తహసీల్దారు సోమ్లానాయక్, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో శాంతి భద్రతలకు ముప్పు

- నియంత్రణ తప్పిన మద్యం, గంజాయి విక్రయాలు
- మత్తులో బెదిరింపులు, దోపిడీలు, హత్యల దృష్టాంతాలు
- రాజకీయ మద్దతుతో పేట్రేగుతున్న నేరస్తులు
- ప్రజలు భయంతో రాత్రి బయటకు రావడానికే వెనుకాడుతున్న పరిస్థితి
- పోలీసు వ్యవస్థ నిర్వీర్యం
- అభద్రతలో ప్రజాస్వామ్యం

రెడ్‌బుక్ మత్తులో ఖాకీలు

నేరాల రికార్డులు

జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితి అల్లకల్లోలంగా మారింది. నేరాల రికార్డులు ఆందోళన కలిగిస్తోంది. మద్యం, గంజాయి మత్తులో యువత విచక్షణ కోల్పోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డబ్బులివ్వకపోతే దారిలో ఒంటరిగా వెళ్తున్న వారిని బెదిరించి, దోచే ఘటనలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. ఫోన్‌పే, గూగుల్‌పే వాలెట్ల నుంచి కూడా డబ్బులు లాక్కుంటున్నారు. క్వార్టర్ మందు కొట్టిస్తే.. ఖూనీలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. రాజకీయ నేతల ప్రోత్సాహంతో నేరస్తులు రెచ్చిపోతున్నారు. మత్తుతో పెరుగుతున్న నేరాలను అరికట్టాల్సిన పోలీస్ విభాగం మొక్కుబడి చర్యలకు పరిమితమవుతోంది.

సాక్షిప్రతినిధి, నెల్లూరు: ఖాకీలకు శాంతి భద్రతల కంటే.. అధికార పార్టీ నేతల ఆదేశాలే ప్రామాణికాలుగా మారాయి. రెడ్‌బుక్ రాజ్యాంగమే గీటురాయిగా మారింది. అధికార పార్టీ నేతల మెప్పు పొందేందుకు అడ్డగోలుగా ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న గొంతుకుల అణిచివేతకు పాల్పడుతున్నారు. అదే ప్రతిపక్ష సభ్యులపై అధికార పార్టీ నేతలు, వారి కిరాయి రౌడీమూకలు సాగించే దాష్టీకాలపై మాత్రం నోరుమెదపడం లేదు. 'శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్నాం. పగటి, రాత్రి గస్తీని పెంచడంతో పాటు డ్రోన్‌ల ద్వారా నేరస్తులు, చీకటి కార్యకలాపాలను, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను కట్టడి చేస్తున్నామని పోలీసు అధికారులు అంటున్నారు'. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. శాంతిభద్రతలు అదుపుతప్పుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న అభద్రతాభావం ప్రజల్లో నెలకొంటోంది. ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొంటున్నాయి.

పోలీస్‌శాఖలో రాజకీయ పెత్తనం

కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీసుశాఖలో రాజకీయ ప్రమేయం అధికమైంది. నేతలను ప్రసన్నం చేసుకున్న వారికే దాదాపు పోస్టింగ్‌లు దక్కాయి. దీంతో వారు చెప్పిందే వేదంగా పోలీసు యంత్రాంగం చర్యలు చేపడుతోందన్న విమర్శలున్నాయి. కొందరు అధికారులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపై కనబరుస్తున్న శ్రద్ధ శాంతి భద్రతల పరిరక్షణలో చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసు నిఘా అంతంత మాత్రంగా మారడం నేరస్తులకు కలిసి వస్తోంది. దీంతో వారు యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతున్నారు. ఆర్థిక విభేదాలు, పాతకక్షలు, చిన్నపాటి కారణాలు హత్యల వరకు దారితీస్తున్నాయి.



ఇప్పటికే జిల్లాలో గతేడాది కాలంగా 41కుపైగా హత్యలు, 156 హత్యాయత్నాలు, 30కి పైగా లైంగికదాడులు, దాడి యత్నాలు, దొంగతనాలు, దోపిడీలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. పాత నేరస్తులు ఇతర జిల్లాల్లోనూ దోపిడీలు, హత్యలకు పాల్పడి అక్కడి పోలీసులకు చిక్కిన ఘటనలూ ఉన్నాయని సమాచారం. పోలీసు శాఖలో రాజకీయ జోక్యం కారణంగా శాంతిభద్రతల పరిరక్షణ గాడి తప్పింది. నగరంలో రాత్రివేళ బయటకు రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రశాంతంగా ఉన్న నెల్లూరులో ఇప్పుడు ఎప్పుడెప్పుడు ఏం జరుగుతుందో అనే భయం జనాల్లో పెరుగుతోంది.

- నెల్లూరురూరల్‌కు చెందిన మోహన్‌చందన్‌ను మద్యం తాగుదామని పిలుచుకెళ్లి ఆ మత్తులోనే స్నేహితులే హత్య చేసి పెన్నానదిలో పూడ్చారు.
- ఉదయగిరిలో బావను బావమరుదులు కిరాతకంగా హత్య చేసి పరారయ్యారు.
- నగరంలో రౌడీషీటర్ భాను విష్ణువర్ధన్ తన అనుచరులతో నాగేంద్రపై కత్తులతో దాడిచేశారు.
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీమంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై టీడీపీ మూకలు, పాత నేరస్తులు దాడి చేసిన ఘటన దీనికి నిదర్శనం. నిందితులెవరన్నది తెలిసినా పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులుగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం పోలీసుల వ్యవస్థ ఎంత నిష్పాక్షికంగా వ్యవహరిస్తుందో అర్థమవుతోంది.

24/7 మద్యం, గంజాయి

మత్తులో నేరాలు అధికమయ్యాయి. ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ దొరుకుతున్న మద్యం. విచ్చలవిడిగా జరుగుతున్న గంజాయి విక్రయాలు. దీంతో యువత మత్తుకు అలవాటు పడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో జిల్లాలో 200 లైసెన్స్ మద్యం షాపులు ఉండగా అనధికారికంగా సుమారు 2 వేలకు పైగా బెల్టు షాపులు ఉన్నాయి. 24 గంటలు మద్యం అందుబాటులో దొరుకుతున్నాయి. గంజాయి విక్రయాలు విద్యాసంస్థల వరకూ విస్తరించాయి. అనేక విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా గంజాయి సరఫరా చేయడంలో బరి తెగిస్తున్నారు. పోలీసు అధికారులపైనా దాడులు చేసేందుకు వెనుకాడడం లేదు. మత్తులో నేరాలు అధికమయ్యాయి. మత్తులో విచక్షణ మరిచి అయిన వారిని, స్నేహితులను, ప్రత్యర్థులను అతి కిరాతకంగా హత్యలు చేస్తున్నారు. చిన్నారులను చిదిమేస్తున్నారు. మత్తు, ఇతర వ్యసనాలకు బానిసైన కొందరు తమ అవసరాల కోసం ప్రజలను కత్తులతో చంపుతామని బెదిరించి అందిన కాడికి దోచుకెళుతున్నారు. మత్తు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాల నిషేధానికి ఏర్పాటు చేసిన పోలీస్ వ్యవస్థ మొక్కుబడి చర్యలకే పరిమితమైంది. కిరాయి సంస్కృతి పెరుగుతోంది. జిల్లాకు చెందిన కొందరు ఇతర జిల్లాల్లో హత్యలు, దోపిడీలకు పాల్పడుతూ అక్కడి పోలీసులకు చిక్కి జైలు పాలైన ఘటనలు లేకపోలేదు.

నేరస్తులకు అధికార పార్టీ అభయం

నేరస్తులకు అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉంటున్నాయి. దీంతో నేరస్తులు నేరాలకు పాల్పడిన అనంతరం అధికార పార్టీ నేతలను ఆశ్రయించి పోలీసుస్టేషన్లలో లొంగిపోతున్నారు. పోలీసులు ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటున్నారు. అధికార పార్టీ నేతలే కొందరు నేరాలకు ప్రోత్సహిస్తుండడంతో శాంతిభద్రతలకు పూర్తి స్థాయిలో విఘాతం ఏర్పడుతోంది. ఇటీవల మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో జరిగిన విధ్వంసకాండే నిదర్శనంగా నిలుస్తోంది. అధికార పార్టీ నేతల ప్రోద్బలంతో టీడీపీ మూకలు, పాతనేరస్తులు ప్రసన్న ఇంటిలో బీభత్సం సృష్టించారు. నిందితులెవరన్నది పోలీసులకు తెలిసినప్పటికి గుర్తుతెలియని వ్యక్తులంటూ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం అధికారానికి ఏ విధంగా గులాంగిరి చేస్తున్నారో ఇట్టే అర్థమవుతోంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలి. మత్తులోనే నేరాలు అధికంగా జరుగుతుండటంతో మద్యం అనధికార విక్రయాలు, గంజాయి విక్రయాలను పూర్తిస్థాయిలో కట్టడిచేయాలి. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక శక్తులు, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెంచి వారిపై కఠినంగా వ్యవహరిస్తే పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశం ఉంది.

801 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో రెండో కారు వరి నాటిన రైతులకు యూరియా సరఫరా సక్రమంగా అందక ఇక్కట్లు పడుతున్న విషయం తెలిసిందే. రైతుల ఇబ్బందులపై 'సాక్షి'లో వరుసగా మూడు రోజులు 'రైతులకు యూరియా ఇక్కట్లు' శీర్షికతో కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన జిల్లా వ్యవసాయ శాఖాధికారులు స్పందించారు. జిల్లా వ్యాప్తంగా 801 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేస్తున్నట్లు శుక్రవారం జిల్లా వ్యవసాయశాఖాధికారిణి సత్యవాణి తెలిపారు. 18 సొసైటీలు, 28 రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ చేసినట్లు ఆమె వివరించారు. నియోజకవర్గంలోని ఆత్మకూరు, చేజర్ల, అనంతసాగరం, మర్రిపాడు మండలాలతోపాటు ఉదయగిరి నియోజకవర్గంలోని మండలాలకు యూరియా సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లోని ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలకు యూరియా లారీలు చేరాయి. దీంతో రైతులు తమ కష్టాలు కొంతనైనా తగ్గనున్నాయని 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.



చేజర్ల ఆర్‌ఎస్‌కే వద్దకు చేరిన యూరియా లారీ

కార్పొరేటర్ పేనేటి వైఎస్సార్‌సీపీలో చేరిక

నెల్లూరు సిటీ: నెల్లూరురూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి సమక్షంలో 17వ డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్ తిరిగి శుక్రవారం భారీగా తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. పేనేటి సుధాకర్ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతోనే తనకు కార్పొరేటర్ పదవి వచ్చిందన్నారు. కొన్ని అనివార్య పరిస్థితుల్లో టీడీపీలో చేరడం జరిగిందని, అయితే ఆ పార్టీ నాయకుల అరాచకాలతో ప్రజల్లో ఆ పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతుందన్నారు. తనకు రాజకీయ భవిష్యత్ కల్పించిన పార్టీలోనే తిరిగి చేరాలని చేరినట్లు స్పష్టం చేశారు. విజయకుమార్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో పార్టీలోకి వచ్చానన్నారు. పార్టీ బలోపేతానికి తాను శాయశక్తుల కృషి చేసి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేస్తామన్నారు. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలోని ప్రతి కార్యకర్తకు తాను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. గతంలో పార్టీ మారిన నాయకులు తిరిగి పునరాలోచించుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర అధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, 17వ డివిజన్ నాయకులు సీహెచ్ ప్రభాకర్ రెడ్డి, హరిబాబు, గోపి, భాస్కర్, ఓబుల్‌రెడ్డి, రూపేష్, చిన్న, ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొంటారు.



పార్టీలో చేరిన కార్పొరేటర్ సుధాకర్, నాయకులతో ఆనం విజయకుమార్‌రెడ్డి

వేమిరెడ్డి దంపతులకు రాజకీయ పతనం ఆరంభం



మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని కలిసి అండగా ఉంటామని తెలియజేస్తున్న నరేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- దేవుడి విగ్రహాలనూ ధ్వంసం చేశారు
- నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడి అమానుషం
- నల్ల దుస్తులతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన
- రాష్ట్ర రైతువిభాగం అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి

నెల్లూరు (బృందావనం): మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై టీడీపీ రౌడీమూకలు చేసిన దాడి, విధ్వంసాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో 100 మంది నల్ల దుస్తులు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. ఆ పచ్చదండు దాడిని తీవ్రంగా ఖండిస్తూ ప్రసన్నకుమార్‌రెడ్డికి అండగా ఉంటామని తెలిపారు. ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిని వీక్షించి టీడీపీ గూండాల దురాగతాన్ని తీవ్రంగా ఖండించారు. బట్టేపాటి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రశాంతత, రాజకీయ చైతన్యానికి మారు పేరైన సింహపురి గడ్డపై మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఎక్కడా, ఎన్నడూ చూడని విధంగా ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై ముష్కర మూకలు దాడి చేయడం, ఆయన మాతృమూర్తి, 85 ఏళ్ల వృద్ధురాలైన నల్లపరెడ్డి శ్రీలక్ష్మమ్మను భయభ్రాంతులకు గురి చేయడం కిరాయి మూకల రాక్షసానందాన్ని ప్రతి ఒక్కరు ఖండిస్తున్నారన్నారు. జిల్లాలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి రెడ్డి దంపతులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక పిరికి పంద చర్యకు పాల్పడ్డారన్నారు. ఆయన ఇంట్లో దేవుళ్ల పటాలను, విగ్రహాలను ధ్వంసం చేశారన్నారు. ఆ దేవుళ్లే వారికి గుణపాఠం చెబుతారన్నారు. ఈ ఘటనతో వేమిరెడ్డి దంపతులకు రాజకీయ పతనం తప్పదన్నారు.

ఎటుచూసినా గుర్రపుడెక్క..

తొలగించేదెప్పుడో..!

నెల్లూరులోని స్వర్ణాల చెరువు, నెక్లెస్ రోడ్డులోని గణేష్ ఘాట్ గుర్రపు డెక్కతో నిండిపోయాయి. చెరువులో గుర్రపుడెక్క తొలగించే యంత్రం, బోటు ఇరుక్కుపోయాయి. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

బోటును ఇలా వదిలేశారు



గుర్రపుడెక్కను తొలగించే యంత్రాన్ని వదిలేశారిలా..





స్వర్ణాల చెరువులో ఇలా..



గణేష్ ఘాట్ వద్ద కనుచూపుమేరంతా..

ప్రేమ పేరుతో వేధింపులు

• బాలికపై యువకుడి దాడి

ఆత్మకూరు: ప్రేమించాలంటూ బాలికను వేధించి దాడికి పాల్పడిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్కే జిలానీ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆత్మకూరు మండలంలోని వాశిలి గ్రామానికి చెందిన బాలిక ఆత్మకూరు పట్టణంలోని ఓ పాఠశాలలో చదువుతోంది. అదే గ్రామానికి చెందిన చందన్ అనే యువకుడు ఆమెను కొద్ది రోజులుగా వేధిస్తున్నాడు. ప్రేమించాలంటూ ఇబ్బంది పెడుతున్నాడు. శుక్రవారం వాశిలి గ్రామం నుంచి ఆత్మకూరుకు పాఠశాల బస్సులో బాలిక బయలుదేరింది. నెల్లూరుపాళెం సెంటర్ వద్ద ఆగి ఉన్న బస్సులోకి చందన్ ఎక్కి బాలికను కొట్టి పరారయ్యాడు. బాధిత తల్లి ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.25
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5



సమస్యలపై చర్చించే తీరిక లేదా?

• జెడ్పీ సర్వసభ్య సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధుల డుమ్మా
• ఓవైపు యూరియా కొరతతో రైతుల ఇబ్బందులు
• మరోవైపు బిల్లులు రాక కూలీల ఆవేదన
• ఇవేమీ పట్టని కూటమి పెద్దలు
• పనులు ప్రారంభించకపోవడంపై చైర్‌పర్సన్ ఆవేదన



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న మంత్రి ఆనం, చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్



ఖాళీగా ప్రజాప్రతినిధుల కుర్చీలు

నెల్లూరు(పొగతోట): జిల్లాలో ప్రజలు వివిధ సమస్యలతో సతమతమవుతున్నారు. రైతులు యూరియా దొరక్క రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. వీటిపై చర్చించేందుకు కొందరు కూటమి ప్రజాప్రతినిధులకు సమయమే దొరకలేదు. ఎంతో ముఖ్యమైన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి డుమ్మా కొట్టారు. మూడునెలలకొకసారి నిర్వహించే సమావేశానికి మంత్రులు, శాసనసభ్యులు, ఎంపీ, ఎమ్మెల్సీలు హాజరుకావాల్సి ఉంది. కానీ అలా జరగలేదు. కూటమి ప్రజాప్రతినిధుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముందుగా మాజీ చైర్మన్ బాలచెన్నయ్య మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సభ



గౌరవ వేతనాల కోసం నిరసన తెలుపుతున్న జెడ్పీటీసీ సభ్యులు

ప్రారంభంలో జెడ్పీటీసీ సభ్యులు లేచి తమకు గౌరవ వేతనం రాలేదని, జనరల్ బాడీ నుంచి కేటాయించాలని తీర్మానం కోసం పట్టుబట్టారు. అరుణమ్మ స్పందించి పదినెలల గౌరవ వేతనం జనరల్ ఫండ్ నుంచి కేటాయిస్తామని తెలిపారు. మిగిలిన మొత్తం కోసం కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో సభ్యులు ఆమెకు అభినందనలు తెలిపారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ సభ్యులడిగిన వాటికి త్వరలో సమాధానం ఇస్తామన్నారు. జిల్లా పరిషత్‌లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగులకు సంబంధించి వారి కుటుంబ సభ్యులకు జెడ్పీలోనే కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందన్నారు. ఇతర శాఖల్లో ఇచ్చేందుకు అవకాశం లేదని తెలిపారు. సమావేశంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఉదయగిరి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, నెలవల విజయశ్రీ, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారంతో రావాలి

ముఖ్యఅతిథిగా విచ్చేసిన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాలనుకుంటే సమాధానం కూడా అదే రీతిలో ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను నేరుగా స్థానిక సంస్థలకే కేటాయిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో వెంకటగిరి నియోజకవర్గం, ఇతర ప్రాంతాల్లో మండల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారన్నారు. కొన్ని అసంపూర్తిగా ఉన్నాయని, మరికొన్ని ప్రారంభం కాలేదని, ఎందుకు జాప్యం జరుగుతుందో జెడ్పీ సీఈఓ కలెక్టర్‌కు వివరణ ఇవ్వాలని తెలిపారు. ఇకపై జరిగే సమావేశాలకు అధికారులు సమగ్ర సమాచారంతో రాకుంటే ఉపేక్షించేది లేదని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో రూ.48 కోట్లతో 33 దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

పనులు ప్రారంభించలేదు

చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ జిల్లాలో వివిధ మండలాల్లో పాఠశాలల భవన నిర్మాణాలకు, డీపీఆర్సీ భవనాలకు నిధులు ఇచ్చామన్నారు. ఒక్కపని ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీపీ గూడూరులో గ్రామంలో పాఠశాల కూలే స్థితికి వచ్చిందని, దాన్ని తొలగించాలని, మరో బడిలో వాటర్ ట్యాంక్ నిర్మించాలని ఎనిమిది నెలల నుంచి అడుగుతున్నా ఫలితం లేదన్నారు. నెల్లూరు రూరల్ మండలంలో పాఠశాలకు రూ.16 లక్షలు ఇచ్చామన్నారు. శంకుస్థాపన విషయంలో ప్రొటోకాల్ పాటించలేదని, కార్యక్రమానికి ఆహ్వానించలేదన్నారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని అనేక పర్యాయాలు విజ్ఞప్తి చేశామన్నారు. దీనికి సంబంధించి పీఆర్ ఎస్ఈ సరైన వివరణ ఇవ్వలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఎవరేమన్నారంటే..

• కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ కావలి జెడ్పీ పాఠశాలకు సంబంధించిన భూమి ఆక్రమణకు గురైందన్నారు. కొత్తగా విద్యుత్ మీటర్లు బిగించడంతో బిల్లులు అధికంగా వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు.
• వాకాడు జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది జాబ్‌కార్డులు కలిగిన పేదలకు పనులు కల్పించడం లేదన్నారు. పశువుల షెడ్లు నిర్మించకుండానే వివిధ ప్రాంతాల్లో బిల్లులు డ్రా చేశారన్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రశ్నించినందుకు నాన్‌బెయిల్‌బుల్ కేసులు పెట్టి వేధిస్తున్నారని వాపోయారు. పనులు కల్పించాలని అడిగినందుకు కేసులు బనాయించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.
• కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కలువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. బడి గేటు ఎదుట చికెన్ స్టాల్స్ ఏర్పాటు చేశారని, వ్యర్థాలను ఆవరణలో వేస్తుండటంతో దుర్వాసన వస్తోందన్నారు. భారీ వర్షాల సమయంలో రోజుల తరబడి విద్యుత్ సరఫరా ఉండడం లేదన్నారు.

ఓపీఎస్‌కు మార్చాలంటూ నిరసన

నెల్లూరు రూరల్: సీపీఎస్ అమలు తేదీ కంటే ముందే వెలువడిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలకు ఎంపికై, ఇతర కారణాలతో ఆలస్యంగా విధుల్లో చేరిన 11,000 మందికి ఓల్డ్ పెన్షన్ విధానం అమలు చేయాలని డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం నాయకులు కోరారు. శుక్రవారం నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం డీఆర్వో హుస్సేన్ సాహెబ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మెమో 57ను అనుసరించి అర్హత గల ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్లు డి.సుబ్బయ్య టీవీ కృష్ణయ్య, ఎన్.సూర్యప్రసాద్, మాసా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఫోరం నాయకులు

నీటి సంపులో పడి..

• వ్యక్తి మృతి

ముత్తుకూరు (పొదలకూరు) : మండలంలోని అదానీ కృష్ణపట్నం పోర్టు ఐదో బెర్త్ సమీపంలో శుక్రవారం ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కాకినాడకు చెందిన కృష్ణయ్య (55) కొంతకాలంగా వంట మాస్టరుగా పనిచేస్తున్నాడు. ఐదో బెర్త్ ఎస్ఎస్ స్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు సంపులో పడి ఊపిరాడక మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.



కృష్ణయ్య మృతదేహం

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 120
లేయర్ (లైవ్)	: 112
బ్రాయిలర్ చికెన్	: 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 190



కావలి కాలువలో మృతదేహం

దగదర్తి: మండలంలోని మబ్బుగుంట పాళెం సమీపంలో ఉన్న కావలి కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై జంపాని కుమార్ కథనం మేరకు.. సంగం మండలం తరుణవాయి గ్రామానికి చెందిన తిరుపతయ్య (75) గురువారం మధ్యాహ్నం కావలి కాలువ పక్కనే ఉన్న తన పొలంలో పనికి వెళ్లాడు. అతను ఇంటికి తిరిగి రాలేదని, కాలువలో పడి ఉంటాడని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తూ సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మబ్బుగుంటపాళెం సమీపంలో ఉన్న కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దానిని పోలీసులు బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీస్

బాధితులకు అండగా వైఎస్సార్‌సీపీ



శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న బుర్రా

గుడ్లూరు: వైఎస్సార్‌సీపీలో పనిచేసిన కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. మండలంలోని బసిరెడ్డిపాళెం పంచాయతీ చెంచిరెడ్డిపాళెనికి చెందిన నరాల శ్రీనివాసులురెడ్డి పార్టీలో రైతు విభాగం అధ్యక్షుడిగా పనిచేశారు. ఇటీవల ఆయన ఆత్మహత్య చేసుకోవడంతో పార్టీ శ్రేణులు బుర్రా దృష్టికి తీసుకెళ్లాయి. ఆయన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీనివాసులురెడ్డి విషయం చెప్పారు. వెంటనే జగన్ బాధిత కుటుంబానికి రూ.లక్ష అందించాలని బుర్రాను ఆదేశించారు. మరో రూ.లక్షను కలిపి మొత్తం రూ.2 లక్షలను బాధిత కుటుంబానికి అందించారు. దీంతో కుటుంబ సభ్యులు మాజీ సీఎం జగన్, బుర్రాకు కృతజ్ఞతలు తెలిపారు.

మైనింగ్ లీజుకు జాయింట్ సర్వే

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో మైనింగ్ లీజు భూముల విషయమై శుక్రవారం జాయింట్ సర్వే చేశారు. 793 సర్వే నంబర్‌లో సుమారు 114.71 ఎకరాల భూమి ఉంది. అది కొండ పోరంబోకు. గతంలో ఆ భూమిలో మైనింగ్ లీజు ఉండేది. కాలక్రమేణా గడువు ముగిసింది. దీంతో 40 ఎకరాల్లో సుమారు 21 మందికి పైగా పేదలు ఆ ప్రాంతంలో నిమ్మ, మామిడి సాగు చేస్తున్నారు. మళ్లీ లీజు పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకోవడంతో రైతులకు స్థానిక రెవెన్యూ అధికారులు ఇటీవల నోటీసులు అందించారు. దీంతో భూములను సమగ్ర సర్వే చేసేందుకు ప్రభుత్వం జాయింట్ సర్వే బృందాన్ని ఏర్పాటు చేసింది. తహసీల్దార్ సుభద్ర, ఉద్యాన శాఖాధికారి ఆనంద, అటవీ అధికారి శ్రీనివాసులు భూములను పరిశీలించారు. అందులో ఉన్న నిమ్మ, మామిడి చెట్ల స్థితిగతులపై ఆరా తీశారు. సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

కండలేరులో 29.294 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 29.294 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,950, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

రాపూరు: మండలంలోని రాపూరులో జరిగిన శీనయ్య అనే వ్యక్తి హత్య కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాపూరు దళితవాడకు చెందిన లేబాకు శీనయ్య (28)కు పంగిలి గ్రామానికి చెందిన ధనమ్మతో 2022 సంవత్సరంలో వివాహమైంది. కాగా అప్పటికే ధనమ్మకు అదే గ్రామానికి చెందిన కూనిపోగు కల్యాణ్ అలియాస్ వెంకటరమణయ్యతో వివాహేతర సంబంధం ఉంది. పెళ్లి తర్వాత కూడా ఆ సంబంధం కొనసాగింది. దీంతో వారు ఎలాగైనా శీనయ్యను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నారు. బుధవారం రాత్రి శీనయ్య మద్యం తాగి ఇంట్లో నిద్రపోతుండగా ధనమ్మ కల్యాణ్‌కు ఫోన్ చేసి రమ్మని చెప్పింది. అతను తాడు, ఆటో గేర్ వైరు తీసుకొచ్చి శీనయ్య చేతులు, కాళ్లు కట్టేసి మెడపై ఆటో గేర్ వైరుతో ఊపిరాడకుండా హత్య చేశారు. సహజ మరణంగా చూపించేందుకు ప్రయత్నించారు. శీనయ్య మద్యం తాగి తలుపునకు కొట్టుకుని పడిపోయాడని అతని తల్లిదండ్రులకు ధనమ్మ గురువారం చెప్పి నమ్మించాలని చూసింది. శీనయ్య చెవి నుంచి రక్తం వచ్చి ఉండగా తల్లి రమణమ్మ అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. ధనమ్మ, కల్యాణ్‌ను శుక్రవారం సాయంత్రం డిగ్రీ కళాశాల వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ వివరించారు. ఈ సమావేశంలో ఎస్సై వెంకటరాజేష్, కండలేరు డ్యామ్ ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ